సంపుటి : 9
సంచిక : 293
గురువారం
16 జులై 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వంవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

E-PAPER




Contact For Ads:
7579339999

విశ్వం వాయిస్ VOICE OF THE PEOPLE
నిజం గళం.. ప్రజల పక్షం

# కాపు సింహం ఇక లేదు..
# కన్నీటి సంద్రమైన కిర్లంపూడి!

“ పట్టుదలకు, పోరాటానికి, ఇచ్చిన మాటకు కట్టుబడిన అజేయ నేత ముద్రగడ.. కోస్తా రాజకీయాల్లో ఒక వీర శకం ముగింపు



ముద్రగడ పద్మనాభం
(25 జూన్ 1952 – 8 జులై 2025)

## అశ్రునయనాల మధ్య కిర్లంపూడిలో అంత్యక్రియలు.. పాడె మోసిన వైఎస్ జగన్















**విశ్వం వాయిస్ బ్యూరో, కిర్లంపూడి (కాకినాడ జిల్లా):** ఆంధ్రప్రదేశ్ సామాజిక, రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసి, సుదీర్ఘకాలం పాటు కాపు సామాజికవర్గ హక్కుల కోసం సింహగర్జన చేసిన అజేయ నేత, మాజీ మంత్రి లిలిముద్రగడ పద్మనాభం (ముద్రగడ పద్మనాభ రెడ్డి) (73) అంత్యక్రియలు బుధవారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహ ప్రాంగణంలో అశ్రు నయనాల మధ్య ముగిశాయి. కిడ్నీ సంబంధిత, వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం జరిగిన అంతిమ సంస్కారాల ప్రక్రియలో వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, రాజకీయ నేతలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. దీంతో కిర్లంపూడి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

**పాడె మోసిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి**

ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి నివాళులర్పించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా కిర్లంపూడి చేరుకున్నారు. ముద్రగడ మిగతా .. 2లో..

### పవన్ గెలిస్తే పేరు మార్చుకుంటానన్న ప్రతిజ్ఞ..

2024 ఎన్నికల్లో పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్ గెలవబోరని, గెలిస్తే పేరు మార్చుకుంటానని సవాల్ చేసిన ముద్రగడ.. పవన్ విజయం సాధించిన తర్వాత తన మాట ప్రకారం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తన పేరును 'ముద్రగడ పద్మనాభ రెడ్డి' అధికారికంగా మార్చుకున్నారు.

### ప్రముఖుల సంతాపం..

- చంద్రబాబు నాయుడు, సీఎం, ఏపీ
- పవన్ కల్యాణ్, డి ప్యూటీ సీఎం, ఏపీ
- రేవంత్ రెడ్డి, సీఎం, తెలంగాణ
- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ అధినేత

ముద్రగడ పద్మనాభం మరణం ఏపీ రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు తీరం లోటని కొనియాడారు.

### రాజకీయ ప్రస్థానం

| 1978 | 1983 | 1996 | 2000-2014 | 2016 | 2025 జులై 8 |
|---|---|---|---|---|---|
| జనతా పార్టీ ద్వారా ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా రాజకీయ ప్రవేశం | ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పదవీ బాధ్యతలు | కాకినాడ ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు | కాపు రిజర్వేషన్ల కోసం పోరాటం, ఉద్యమాలు, సామాజిక సేవ | తుని వేదికగా భారీ కాపు రిజర్వేషన్ల ఉద్యమం | కాపు సామాజిక ఉద్యమ యోధుడికి చివరి వీడ్కోలు |

“ నేను ఎప్పుడూ కాపుల గౌరవం కోసం, హక్కుల కోసం పోరాడాను. అదే నా జీవితం.. అదే నా శ్వాస. ”
– ముద్రగడ పద్మనాభం

---

ఇరాన్‌పై పగటిపూట

# దాడులు

వచ్చేవారం మరింత భీకరమంటూ ట్రంప్ వార్నింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధం తలెత్తే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా-ఇరాన్ మధ్య దాడులు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు.. ఈ ఉద్రిక్తతలను మరింత పెంచేలా ఉన్నాయి. శాంతి చర్చలకు టెహ్రాన్ సహకరించకపోతే.. వచ్చేవారం నుంచి సైనిక దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తాజాగా సిచువేషన్ రూమ్‌లో ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిగతా .. 2లో..

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు





**ఇబ్రహీంపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన మిగతా .. 2లో..

షాబాద్ ఘటనలో నిందితుడికి బెయిల్..

# పోలీసుల వైఫల్యమే

రేవంత్‌కు పవన్ లేఖ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో పోక్సో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. షాబాద్ హత్యల ఘటనను ఈ సందర్భంగా పవన్ ప్రస్తావించారు. పోక్సో కేసులో విచారణకు నిర్ణీత గడువు విధించాలని.. బాధితుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పవన్ కోరారు. సాక్ష్యాధారాలు మాయం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. “షాబాద్ కేసులో బాధితులను కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారు. పోక్సో కేసు ఉన్నా నిందితుడికి బెయిల్ ఇవ్వడం వైఫల్యమే. ఈ ఘటనలో పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. పోక్సో కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది” అని పవన్ పేర్కొన్నారు.




తితిదే ట్రస్టులకు

# ఒక్కరోజే రికార్డు స్థాయిలో విరాళాలు



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తితిదే ట్రస్టులకు భారీగా విరాళాలు వచ్చాయి. మంగళవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.96.98 కోట్ల విరాళాలు అందాయి. 2,354 మంది దాతలు ఆన్‌లైన్ ద్వారా, 106 మంది ఆఫ్‌లైన్ ద్వారా వీటిని సమర్పించారు. 1,212 మంది దాతలు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల లోపు ఇచ్చారు. 1,246 మంది భక్తులు రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల లోపు అందించారు. ఇద్దరు భక్తులు రూ.కోటి, మిగతా .. 2లో..

# మహిళల భద్రత కోసం 'అభయ'

అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్న అనిత
చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని సూచన
బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిల్లలకు హితవు



**అనకాపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని మిగతా .. 2లో..

# కాపు సింహం ఇక లేదు.. కన్నీటి సంద్రమైన కిర్లంపూడి!

(మొదటిపేజీ తరువాయి)

పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన జగన్.. తీవ్ర శోకంలో మునిగిపోయిన ముద్రగడ సతీమణి, కుమారుడు గిరిబాబును, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ప్రారంభమైన అంతిమయాత్రలో వైఎస్ జగన్ స్వయంగా పాల్గొని, కొంతదూరం ముద్రగడ పాడెను భుజాన మోసి తన గౌరవాభిమానాలను చాటుకున్నారు. ఈ అంతిమయాత్రలో వైస్సార్సీపీ నేతలు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, జక్కంపూడి గణేష్ సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**పోలీసులు వర్సెస్ అనుచరులు: ప్రభుత్వ లాంఛనాలపై గందరగోళం**

ముద్రగడ పద్మనాభం మాజీ మంత్రి, మాజీ ఎంపీ కావడంతో ఆయన అంత్యక్రియలను అధికారిక ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియ అంతిమయాత్రలో తీవ్ర వివాదానికి దారి తీసింది. ముద్రగడ బతికున్న సమయంలో ప్రభుత్వం ఆయనను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, ఇప్పుడు ప్రభుత్వ లాంఛనాలు వద్దంటూ కుటుంబ సభ్యులు, వైసీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతిమ సంస్కారాల సమయంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించేందుకు ప్రయత్నించగా, వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జక్కంపూడి గణేష్ తదితరులు గట్టిగా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, అనుచరులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరకు ఎలాంటి ప్రభుత్వ లాంఛనాలు లేకుండానే కుటుంబ పద్ధతిలో అంతిమ సంస్కారాలు ముగిశాయి.

**కుమార్తె క్రాంతి శీల రాకపై తీవ్ర ఉద్రిక్తత**

అంతిమయాత్ర సాగుతున్న సమయంలో ముద్రగడ కుమార్తె బర్లపూడి క్రాంతి శీల తన తండ్రిని కడసారి చూసేందుకు రావడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గత ఎన్నికల సమయంలో తండ్రి నిర్ణయానికి భిన్నంగా ఆమె జనసేనలో చేరడం, తండ్రిపై రాజకీయ వ్యాఖ్యలు చేయడంతో ముద్రగడ ఆమెను దూరం పెట్టారు. బుధవారం ఆమె తండ్రి భౌతికకాయాన్ని తాకేందుకు ప్రయత్నించగా.. ముద్రగడ కుటుంబ సభ్యులు, అనుచరులు ఆమెను తీవ్రంగా ప్రతిఘటించి లోపలికి రాకుండా అడ్డుకున్నారు. ఉద్రిక్తత పెరగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి క్రాంతి శీలను అక్కడి నుండి సురక్షితంగా పంపించివేశారు. ఆమె కన్నీటితో దూరం నుంచే తండ్రికి వీడ్కోలు పలికి వెనుదిరిగారు.

**ముగిసిన ఒక సుదీర్ఘ పోరాట శకం**

1978లో జనతా పార్టీ ద్వారా ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా అతి పిన్న వయసులోనే రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ముద్రగడ.. ఆపై ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా సేవలందించారు. కాకినాడ ఎంపీగా కూడా దేశ పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. పదవుల కంటే కూడా తన సామాజికవర్గం కోసం ఆయన సాగించిన ఉద్యమాలే చరిత్రలో నిలిచిపోయాయి. ముఖ్యంగా 2016లో తుని వేదికగా ఆయన నడిపించిన కాపు రిజర్వేషన్ల పోరాటం ఏపీ రాజకీయ చిత్రపటాన్నే మార్చేసింది. పట్టుదలకు, ఇచ్చిన మాటకు కట్టుబడే నైజానికి నిదర్శనంగా నిలిచిన ముద్రగడ భౌతికకాయాన్ని ఆయన వీలునామా ప్రకారం కిర్లంపూడి తోటలోనే దహనం చేయడంతో కోస్తా రాజకీయాల్లో ఒక వీర శకం ముగిసింది.

**పవన్ గెలిస్తే పేరు మార్చుకుంటానన్న ప్రతిజ్ఞ..**

2024 అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ గెలవబోరని, ఒకవేళ గెలిస్తే తన పేరు మార్చుకుంటానని సవాల్ చేసిన ముద్రగడ.. పవన్ విజయం సాధించిన తర్వాత తన మాట ప్రకారం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తన పేరును అధికారికంగా 'ముద్రగడ పద్మనాభ రెడ్డి'గా మార్చుకుని రాజకీయాల్లో నైతిక విలువలకు సరికొత్త భాష్యం చెప్పారు.

**ప్రముఖుల సంతాపం..**

ముద్రగడ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఏపీ రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని కొనియాడారు.

(మొదటిపేజీ తరువాయి)

# ఇరాన్‌పై పగటిపూట దాడులు

ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఈసారి పగటిపూటే..**

ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే.. ఇరాన్‌పై అమెరికా మరో దఫా దాడులు ప్రారంభించింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అయితే, ఇటీవలి కాలంలో ఎక్కువగా రాత్రివేళల్లోనే దాడులు చేసిన అగ్రరాజ్యం.. ఈసారి పగటిపూటే విరుచుకుపడటం గమనార్హం. హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీర ప్రాంతాల్లోని టెహ్రాన్ సైనిక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా డ్రోన్లతో దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇరాన్ రక్షణ, క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గ్రేటర్ తున్బ్ ద్వీపంపై దాడి చేసినట్లు తెలిపింది. హర్మూజ్‌లో నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా ఆ దేశ సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడమే తమ లక్ష్యమని అగ్రరాజ్యం వెల్లడించింది.

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

**తితిదే ట్రస్టులకు**

# ఒక్కరోజే రికార్డు స్థాయిలో విరాళాలు

అంతకంటే ఎక్కువ విరాళం సమర్పించారు. బుధవారం నుంచి కొత్త డోనర్ పాలసీ అమలు నేపథ్యంలో దాతలు మంగళవారం భారీగా విరాళాలను అందించారు. సామాన్య భక్తుల భవిష్యత్తు దర్శనాలను దృష్టిలో పెట్టుకొని వివిధ ట్రస్టులు, పథకాలకు కొత్తగా విరాళాలు అందించే దాతలు/సంస్థలకు కల్పించే సేవలు, సదుపాయాల్లో (ప్రివిలేజెస్) మార్పులు చేసినట్లు తితిదే మంగళవారం ప్రకటించింది. దాతల సదుపాయాలను కొంత తగ్గించి కొత్త డోనర్ పాలసీని ప్రవేశపెట్టింది. జూన్ 26 వరకు 1,97,888 మంది దాతలుగా నమోదయ్యారు.

# మహిళల భద్రత కోసం 'అభయ'

వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో 'అభయ' కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా 'అభయ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'మహిళల భద్రత - మా బాధ్యత' అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాల వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి 'అభయ' కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని... కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని అనిత సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హితవు పలికారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

# పోలీస్ నోటిఫికేషన్‌పై త్వరలోనే నిర్ణయం

## సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత హామీ





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పరిశీలన నిమిత్తం వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడును శ్యామ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ గుంటూరి శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి ఆయన ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ?రాబోయే పోలీస్ నోటిఫికేషన్‌లో 10 వేలకు పైగా యూనిఫామ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అలాగే అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు కల్పించాలని కోరుతూ సుమారు 6వేల మంది విద్యార్థుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు అందజేశారు.? అనంతరం కాకినాడలో హోంమంత్రి అనితను కూడా గుంటూరి శ్యామ్ కలిసి ఇదే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. నోటిఫికేషన్ త్వరగా వచ్చేలా చొరవ చూపాలని ఆమెను కోరారు.? దీనిపై సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉన్న ఖాళీల వివరాల ప్రాతిపదికన నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే మంత్రివర్గ (క్యాబినెట్) సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించి, త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేస్తామని స్పష్టం చేశారు.? ఈ పరిణామంతో త్వరలోనే పోలీస్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన స్పష్టత రానుండటంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 27వ డివిజన్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

## సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశం?






**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్‌కు చెందిన తిలక్ వీధి, దూది మిల్లు ఏరియా, సూర్యనారాయణపురం ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ బుధవారం ఉదయం విస్తృతంగా పర్యటించగా స్థానిక టీడీపీ ఇంచార్జ్ కోడూరి కుమారస్వామి వార్డులోని డ్రైనేజీ, మంచినీరు, వీధిలైట్ల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ?ప్రధాన ప్రవేశ మార్గంలోని డ్రైనేజీ కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టితో పూడిపోవడాన్ని కమిషనర్ గమనించారు. ప్రత్యేక సిబ్బందిని రప్పించి కాలువలను పూర్తిగా శుభ్రం చేయించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త వేయవద్దని ప్రజలను కోరారు. డివిజన్‌లో తాగునీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకోగా, పెద్దగా సమస్యల్లేవని చెప్పారు. అయితే, ఒకచోట ఉన్న ట్యాప్ మరమ్మతును వెంటనే పూర్తి చేయాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. వీధి దీపాల వెలుతురు మరింత పెంచాలన్న స్థానికుల కోరికపై, అదనపు లైటింగ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.? విద్యుత్ స్తంభాల వద్ద పొదల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల చుట్టూ ప్రమాదకరంగా పెరిగిన పొదలను విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో వెంటనే తొలగించాలని సూచించారు.? ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు: ఖాళీ స్థలాల్లో కలుపు మొక్కల వల్ల పాముల సంచారం పెరుగుతోందన్న ఫిర్యాదుపై స్పందిస్తూ.. ఇప్పటికే సదరు యజమానులకు నోటీసులు ఇస్తున్నామని, అవసరమైతే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 84 స్వచ్ఛ వాహనాల ద్వారా ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ సమర్థవంతంగా సాగుతోందని, ప్రజలు తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా అందించి నగర పరిశుభ్రతకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.? ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ అర్జున్, కూటమి నాయకులు గదుల సాయిబాబా (స్టేట్ వెల్ఫేర్ బోర్డు మెంబర్), జనసేన అధ్యక్షులు అర్జున్ రాజు, టీడీపీ సీనియర్ నాయకులు దవులూరి భద్ర రావు, రొంగల బాలరాజు, ఊధా శ్రీను, తిలక్ స్ట్రీట్ శేఖర్, బూత్ ఇంచార్జ్ పట్నాల రాఘవమ్మ, గుడాల దేవి, బండారు వర, శ్రీకాకుళం పండు, కోడూరు నీలిమ, గ్రంధి అమర్, రాజాన అప్పారావు, బొచ్చా వాణి, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

**జగన్ రోజుకో మాట మార్చుతారంటూ మంత్రి నారా లోకేష్ విమర్శలు**
**రాయలసీమ అభివృద్ధికి జగన్ ఒక క్యాన్సర్ గడ్డలా మారారని వ్యాఖ్యలు**
**వైసీపీ ఒక హిట్ అండ్ రన్ పార్టీ అంటూ తీవ్ర ఆరోపణలు**
**పరిశ్రమలను బెదిరించి, యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం**



**జమ్మలమడుగు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రోజుకో మాట, పూటకో వేషం వేస్తుంటారని, ఒకరోజు 'మావిగన్' అంటే, మరోరోజు 'బెంతాహై' అంటారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తాము చట్టప్రకారం పాలన చేస్తుంటే, లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాయలసీమ అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఒక క్యాన్సర్ గడ్డలా మారారని లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ పేరుతో ప్రత్యక్షంగా 10 వేల ఉద్యోగాలు, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. "మైనింగ్ లైసెన్స్ తీసుకుని సుమారు 320 ఎకరాల్లో 'రెడ్ గోల్డ్' సంస్థ పేరుతో ఐరన్ ఓర్‌ను తరలించి విక్రయించుకున్నారు. దీనివల్ల గాలి జనార్ధన్ రెడ్డికి, జగన్‌కు ఆదాయం వచ్చింది తప్ప, కడప యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదు" అని విమర్శించారు. తాము తెచ్చిన కియా పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది జీవనం సాగిస్తున్నారని, ఇదే ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. 2019 నుంచి 2024 వరకు కియా యాజమాన్యాన్ని గొడ్డలి పార్టీ నేతలు బెదిరించారని లోకేశ్ ఆరోపించారు. దాల్మియా సిమెంట్‌కైతే ఏకంగా ఫ్యాక్టరీ మూసేయాలని నోటీసులు ఇచ్చారని, డబ్బులిస్తేనే ఫ్యాక్టరీ నడుస్తుందని, లేదంటే మూసేయాలనే ధోరణిలో వైసీపీ నేతలు ప్రవర్తించారని అన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మూడుసార్లు కడప జిల్లాకు వచ్చాం. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం, ఇప్పుడు దాల్మియా విస్తరణకు శంకుస్థాపన చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా నినాదం. దేశంలోనే రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తున్నాం" అని తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## చరిత్రలో తొలిసారి : రివర్స్‌లో విద్యుత్ ఛార్జీలు!

రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విద్యుత్ పంపిణీ సంస్థలు వరుసగా రెండోసారి ట్రూ-డౌన్ అమలు దిశగా అడుగులు వేస్తున్నాయి. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విద్యుత్ పంపిణీ సంస్థలు వరుసగా రెండోసారి ట్రూ-డౌన్ అమలు దిశగా అడుగులు వేస్తున్నాయి. తద్వారా విద్యుత్ చార్జీల భారం తగ్గనుందని చెబుతున్నారు. గత ఏడాది యూనిట్ కు 13 పైసలు చొప్పున తగ్గించిన విద్యుత్ సంస్థలు ఈ ఏడాది కూడా అంతే మొత్తాన్ని తగ్గించాలని నిర్ణయించాయి. దీంతో విద్యుత్ బిల్లులు యూనిట్ కు 26 పైసలు చొప్పున తగ్గిస్తున్నట్లు అవుతుందని అంటున్నారు. ఈ విధానంలో భవిష్యత్తులో కూడా విద్యుత్ చార్జీలను సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అంటే రానున్న రోజుల్లో యూనిట్ కు రూపాయి మేర తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. సగటు వినియోగదారుడికి తగ్గించిన మొత్తం పెద్దగా ఊరట కలగకపోయినా రాష్ట్రంలో మొత్తం గృహ వినియోగదారులకు 940 కోట్ల మేర ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతోంది.

సామాన్యుడి గృహ బడ్జెట్‌లో కరెంటు బిల్లు ఒక ముఖ్యమైన భాగం. ఇప్పుడు చార్జీల తగ్గింపు వల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలకు నెలవారీ ఖర్చులలో కొంత ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. తద్వారా కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి ఇది దోహదపడుతుందని ప్రభుత్వ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అంతేకాకుండా విద్యుత్ చార్జీల తగ్గింపు పరోక్షంగా నిత్యావసర వస్తువుల ధరలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని అంటున్నారు. విద్యుత్ చార్జీలు తగ్గడం వల్ల చిన్న తరహా పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలు, వ్యవసాయ రంగంలో ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని అంటున్నారు. తయారీ రంగంలో ఖర్చులు తగ్గినప్పుడు, నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉండే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. రవాణా, కోల్డ్ స్టోరేజ్, ఇతర సేవల రంగాల్లో కూడా ఈ ప్రభావం కనిపిస్తుందని చెబుతున్నారు. ఫలితంగా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే అవకాశాలు మెరుగవుతాయని అంటున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.940.07 కోట్ల మిగులును చూపుతూ ఏపీఈఆర్‌సీకి డిస్కంలు నివేదికలు సమర్పించాయి. రాష్ట్రంలో మూడు డిస్కంలు ఉండగా, ఈపీడీసీఎల్ భారీ మిగులుతో మిగిలిన రెండు డిస్కంల నష్టాలను కూడా భర్తీ చేసిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సీపీడీసీఎల్ రూ.21.91 కోట్లు అధికంగా ఖర్చు చేయగా, ఎస్పీడీసీఎల్ ఏకంగా రూ.518.86 కోట్లు అధికంగా ఖర్చు చేసింది. ఇదే సమయంలో విశాఖ కేంద్రంగా పనిచేసే ఈపీడీసీఎల్ మాత్రం 1495.37 కోట్ల మిగులు చూపింది. ఈ విధంగా సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ చూపిన అధిక వ్యయాలను భర్తీ చేసి రికార్డు స్థాయిలో 940.07 కోట్ల మిగులను నమోదు చేసింది. దీంతో ప్రభుత్వం ఈ మొత్తం డబ్బును వినియోగదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఇప్పటివరకు ఒక్క పైసా కూడా విద్యుత్ బిల్లులను పెంచలేదని ప్రభుత్వం చెబుతోంది. గత ప్రభుత్వంలో ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ బిల్లుల మోత మోగేదని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చరిత్రలో లేనట్లు విద్యుత్ బిల్లులను తగ్గిస్తోందని చెబుతున్నారు. గత ప్రభుత్వం విధించిన ట్రూ అప్ చార్జీలు ఇంకా ఒక విడత పెండంగులో ఉన్నట్లు చెబుతున్నారు. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని సర్దుబాటు చేసేందుకు గత ప్రభుత్వం ట్రూ అప్ విధానం అవలంబించిందని అంటున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానాన్ని సమీక్షించి కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకోవడంతో వినియోగదారులకు ఉపశమనం దక్కిందని అంటున్నారు. మొత్తానికి చరిత్రలో ఎన్నడూ లేనట్లు విద్యుత్ చార్జీలు రివర్స్ లో తగ్గడం చర్చనీయాంశంగా మారింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## భార్య ఫోన్ ఎక్కువగా మాట్లాడుతోందని ఘాతుకం



**తెనాలి టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** భార్య అధిక సమయం ఫోన్‌లో మాట్లాడుతుండడంతో అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హత్య చేశాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా తెనాలిలో చోటుచేసుకుంది. తెనాలి గ్రామీణ సర్కిల్ సీఐ షేక్ నాయబ్సూల్ ఎస్సై ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన నరేంద్రబాబుకు పల్నాడు జిల్లా నూజెండ్లకు చెందిన సంధ్యారాణి (27)తో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తెనాలి మండలం అంగలకుదురులో నివాసం ఉంటున్నారు. నరేంద్రబాబు తెనాలి చెంచుపేటలోని ఒక మద్యం దుకాణం వద్ద పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిన నరేంద్రబాబు వచ్చిన సంపాదనను ఇంటి ఖర్చులకు ఇవ్వకుండా భార్యతో నిత్యం గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆమె పలుమార్లు పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుని నరేంద్రబాబు తిరిగి భార్యను ఇంటికి తీసుకొచ్చేవాడు. అయితే ఇటీవల సంధ్యారాణి అధిక సమయం ఫోన్‌లో మాట్లాడుతుండడంపై నరేంద్రబాబు అనుమానం పెంచుకున్నాడు. ఆమెను చంపేయాలని నిర్ణయించుకుని ముందుగా పెద్ద కత్తి కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకున్నాడు. ఈ నెల 10న మద్యం తాగి ఇంటికి వెళ్లి భార్యతో ఘర్షణకు దిగాడు. 'నువ్వు ఇలానే ప్రవరిస్తూ ఉంటే నేను పుట్టింటికి వెళ్లిపోతాను.. ఇక రాను' అని భర్తతో సంధ్యారాణి చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన నరేంద్రబాబు.. ఇంట్లో దాచిన కత్తిని తీసుకుని విచక్షణారహితంగా దాడి చేసి ఆమెను హతమార్చాడు. ఈ సమయంలో నిందితుడి చేతికి సైతం గాయాలయ్యాయి. పోలీసులు పట్టుకుంటారన్న భయంతో నేరుగా పీఎస్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం నిందితుడు నరేంద్రబాబును అరెస్టు చేశామని, న్యాయస్థానంలో ప్రవేశ పెట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. హత్య జరిగిన రోజు ఉదయం సంధ్యారాణి తన తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి మాట్లాడింది. నరేంద్రబాబు తీరు మారలేదని, వచ్చినప్పటి నుంచి వేధిస్తూనే ఉన్నాడని, తనను ఏమైనా చేస్తాడోమోనని చెప్పి భయపడింది. ఆమె ఊహించినట్లుగానే దారుణం జరిగిపోయింది.

## మాదాపూర్‌లో దారుణం.. వేధిస్తున్నాడని యువకుడి దారుణ హత్య



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నపల్లి భాస్కర్ (30) అనే యువకుడిపై దాడి చేసి దారుణంగా హత్య చేసిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అదే గ్రామానికి చెందిన యువతిని గతంలో ప్రేమించాడు. అయితే కుటుంబసభ్యులు మూడేళ్ల క్రితం వేరే వ్యక్తితో ఆమెకు వివాహం జరిపించారు. పెళ్లయినప్పటి నుంచి యువతిని భాస్కర్ వేధిస్తున్నాడనే అనుమానంతో దారుణంగా కొట్టి చంపారు. హత్య చేసింది యువతి కుటుంబ సభ్యులేనని మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో మృతుడి బంధువులు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. యువతి తండ్రి రాజు, అతని బావమరిది పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు సమాచారం. మాదాపూర్ పోలీసులు యువతిని కూడా అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ భాస్కర్ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వర్ధన్నపేట పోలీసులు ఉప్పరపల్లి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కోవూరులో విషాదం.. కారులోనే వ్యక్తి మృతి

**కోవూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని కోవూరు పట్టణం బజార్ ప్రాంతంలో వడ్డీపాలేనికి చెందిన ఆవుల నాగేశ్వరరావు (39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగేశ్వరరావు తన కారులోనే మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుండెపోటు కారణంగా ఆయన మరణించి ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గూగుల్‌లో సెర్చ్ చేస్తాడు..

## షోరూంకు వెళ్లి ఫోన్లు కొట్టేస్తాడు..



**తెనాలి టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** షోరూంలకు కొనుగోలుదారు రూపంలో వెళ్లి మాటలతో మాయ చేస్తూ అక్కడి సెల్‌ఫోన్‌లను చోరీ చేస్తున్న నిందితుడిని తెనాలి పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ రవీంద్రబాబు, ఎస్సై లలిత్ కుమార్ వివరాలు వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం తెనాలిలోని ఓ దుకాణంలో ఫోన్ చోరీకి గురైంది. చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కాగా, నిందితుడి వివరాలను చరవాణుల దుకాణాల వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఈ క్రమంలో అతన్ని మంగళవారం ఒక దుకాణంలో గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నెల్లూరుకు చెందిన 36 ఏళ్ల మురళిగా గుర్తించారు. "నిందితుడు గతంలో హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి మానేశాడు. అనంతరం జల్సాలకు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించాలని చోరీల బాట పట్టాడు. కొన్నేళ్లుగా ఫోన్లను దొంగతనం చేయడం మొదలుపెట్టాడు. ముందుగా గూగుల్‌లో వెతికి.. ఎక్కడెక్కడ మొబైల్ షోరూంలు ఉన్నాయో తెలుసుకుంటాడు. అక్కడికి వెళ్లి ఖరీదైన ఫోన్లనే చూస్తూ, సేల్స్‌మెన్‌లను మాటలతో బురిడీ కొట్టించి ఫోన్ తీసుకుని మాయమవుతాడు. ఇలా నిందితుడిపై రాష్ట్రవ్యాప్తంగా 15 కేసులు నమోదయ్యాయి. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా తీరు మారలేదు. ఒకసారి చోరీ చేసిన ఊరికి మళ్లీ వెళ్లడు. దొంగిలించిన ఫోన్లను విక్రయించి, వచ్చిన నగదుతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లి హోటళ్లలో ఉంటూ జల్సాలు చేసేవాడు. చేతిలో నగదు అయిపోయిన తర్వాత మళ్లీ చోరీ చేసేందుకు వెళ్తాడు. ఇతని తీరుతో విసుగుచెందిన భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు దూరం పెట్టారు" అని పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి తెనాలిలో చోరీకి గురైన మొబైల్స్‌తో పాటు మరో రెండు ఫోన్లను (విలువ సుమారు రూ. 2.50 లక్షలు) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

విశ్వంవాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా | తూర్పు గోదావరి జిల్లా | డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

గురువారం, 16 జూలై, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత www.viswamvoice.com

### స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మరణం

# రాష్ట్రానికి తీరని లోటు

## భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రులు వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్





**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం మంత్రులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన వ్యక్తిగా ముద్రగడ పద్మనాభం గారు చిరస్మరణీయులుగా నిలిచిపోతారని అన్నారు. 1978లో తొలిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికైన ఆయన నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, కాకినాడ లోక్‌సభ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. ప్రజల హక్కుల సాధన కోసం, ముఖ్యంగా కాపు సమాజ అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి విశేషమని కొనియాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావం కలిగిన ముద్రగడ పద్మనాభం మరణం బాధాకరమైన సంఘటన అని మంత్రి సుభాష్ అన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఆయన ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారని పేర్కొన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నాయకుడని, ఆయన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఆయన చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. స్వర్గీయ ముద్రగడ పద్మనాభం గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, ఆయన సతీమణి, కుమారులు, కుమార్తె, కుటుంబ సభ్యులు, అభిమానులు, మద్దతుదారులకు మంత్రులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, కాపు సంఘాల నేతలు, ప్రజలు, ముద్రగడ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

### జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌గా

# డాక్టర్ పితాని కోమల బాధ్యతలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ పితాని కోమల ఈ రోజు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందించడం జరిగింది. ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్‌గా జాయిన్ అయిన కోమల తాను తీసుకున్న ప్రతి బాధ్యతలు కష్టపడి పనిచేసి ఆ పదవికి వన్నె తెచ్చారు. మృదు స్వభావి అయిన ఆమె అందరితో ఆప్యాయంగా మాట్లాడి అందరి మన్ననలు పొందారు. ఈ బాధ్యతలు కూడా విజయవంతంగా పూర్తి చేసుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించిస్తూ అభినందనలు తెలిపారు. యువర్ హోం అధినేత కడియాల గోపాలకృష్ణ, నయనాల కృష్ణారావు,మార్గాని చంటిబాబు, రాయుడు శ్రీనివాస్, బిఎస్ఎన్ రామూనాయుడు, గుడివాడ తాతయ్య, కె.మేఘేంద్ర, విజయ్ అభినందించారు.

# వృద్ధులకు గొడుగులు పంపిణీ



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలం బావాజీ పేట లేఅవుట్ కాలనీలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్),ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ లలిత మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి చిన్ని కుమార్తె లలిత వీరవేణి పదకొండవ వర్ధంతి సందర్భంగా గోకవరం మండలం భావాజీపేట లేఅవుట్ కాలనీలో వృద్ధులకు గొడుగులు పంపిణీ చేసారు,అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పీఎంపీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, పీ దేవానందం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి డాక్టర్ జి.మహాలక్ష్మిలు హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు, వృద్ధులకు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. నిరుపేదలకు అందించే సేవలే సంతృప్తినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ గోకవరం మండల అధ్యక్షుడు, జిల్లా కోశాధికారి పి చిన్ని,కార్యదర్శి ఎస్ సూరిబాబు, కోశాధికారి జి.లాజర్, సహాయ కార్యదర్శి గంటి వెంకటేష్, ములగాడ శ్రీను, ఎమ్.మల్లేష్, ఐ.నాగేశ్వరరావు, గౌరి, దమ్ము వెంకటరమణ, శీలం వెంకటేష్, వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 19న బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి తరలిరావాలి

## సంఘీయులకు జేఏసీ, ఆహ్వాన కమిటీల ఆహ్వానం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం జెఎన్ రోడ్‌లో ఉన్న మన్యం గార్డెన్స్‌లో ఈనెల 19వ తేదీ ఆదివారం జరిగే బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి బ్రాహ్మణ సంఘాలు, కుటుంబాలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని జేఏసీ, ఆహ్వాన కమిటీ తరపున నాయకులు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమానికి సంఘీయుల నుంచి విశేష స్పందన వస్తోందని తెలిపారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ, ఆహ్వాన కమిటీ నాయకులు భమిడిపల్లి వెంకట రమణ మూర్తి (బాబు), బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహ మూర్తి, కోలగంటి రమేష్ మాట్లాడారు. బ్రాహ్మణులను సంఘటితం చేయడమే లక్ష్యంగా మన గళం.. మన బలం పేరుతో ఈ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి సంఘీయులను సమాయత్తం చేసామని, భారీ ఎత్తున కుటుంబాలతో సహా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారని వివరించారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించడంతో పాటు వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా విధులు నిర్వర్తించే వారికి గుర్తింపు కార్డులు జారీచేయడం వంటి విషయాన్ని ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈనెల 18వ తేదీ శనివారం మన్యం గార్డెన్స్‌లో ఉదయం గణపతి హోమంతో కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని, సాయంత్రం 5 గంటలకు మార్కండేయేశ్వర ఆలయం వద్ద నుంచి పుర వీధుల మీదుగా బ్రాహ్మణ యువతతో భారీ బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. హరే శ్రీనివాస భజన మండలి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి వారి వైభవంపై సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందన్నారు. 19వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆత్మీయ సమావేశం అనంతరం విందు జరుగుతుందన్నారు. సమావేశంలో ఇతర నాయకులు దూర్వాసుల సత్యనారాయణ, ముత్య సత్యనారాయణ, నిమిషకవి వెంకటేష్, రెంటచింతల శ్రీనివాస్, ముత్య శంకర ప్రసాద్, పోరంకి సాయిరామ్ శర్మ, కాశీపట్నపు మణికంత, కొటికలపూడి ఈశ్వరరావు, కోలగంటి నాగరాజు, దువ్వూరి గోపి, పొట్నూరి రవి శర్మ తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్య డిగ్రీ & పీజీ మహిళా కళాశాల సుప్రీతికి

# గూగుల్ అంబాసిడర్ అవార్డు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేం ద్రవరం డిగ్రీ బిసిఎ మూడవ సం వత్సరం చదువుతున్న సుప్రీతీకి ప్రముఖ గూగుల్ సంస్థ వారు అంబాసిడోర్ అవార్డును ప్రకటన చేశారు,ఈ ఘనతను సాధించిన సుప్రీతీని ఆదిత్య సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ, అకాడమిక్ డైరెక్టర్ నాయుడు అభినందిం చారు. ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ అన్ని రకాల విజయాలను సాధించాము ప్లేసెమెంట్స్ మరియు రిజల్ట్స్ విషయాలు లోను నూటికి నూరు శాతం సాధించాము ఇప్పుడు దేశంలో ప్రముఖ కంపెనీ అయిన గూగుల్ సంస్థ వారు ఈ అవార్డు మా అమ్మాయికి ఇవ్వడం ఈ ఘనతకు చాలా సంతోషస్తున్నాను అని కొనియాడారు, మరియు కాలేజీ అధ్యాపక బృందం అధ్యాప ఇతర సిబ్బంది అమ్మాయిని అభినందించారు.

# విద్యార్థినీలకు నోట్ బుక్స్ పంపిణీ



## ఘనంగా కేశన శంకరరావు జన్మదిన వేడుకలు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేశన శంకర్రావు జన్మదిన వేడుకలు సందర్భంగా పేద విద్యార్థినిలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.పసిపాపల కేరింతల సవ్వడిలో సందడిగా బీసీ నేత కేశన శంకర్రావు జన్మదిన వేడుక తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దొమ్మేటి సోమ శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ముచ్చకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ వెనకబడిన వర్గాల వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కేశన శంకర్రావు ఆయురారోగ్యాలతో ఉంటూ, తన లక్ష్యాలను నెరవేర్చడం ద్వారా సామాజిక సమానత్వం సాధించాలంటూ శుభాకాంక్షలు అందించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సప్పా వెంకటరమణ మాట్లాడుతూ ఆపదలో ఉండి సమస్యల వలయంలో చిక్కుకొని ఉన్న ప్రతి బీసీని ఆదుకోవాలని వారు కోరుతూ ఉంటారని ఆయన అన్నారు. మహిళా విభాగం నగర కన్వీనర్ దొమ్మేటి కృష్ణవేణి, అయితం రెడ్డి బేబీ, భారతి తదితరులు కేశన శంకరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాది చిన్న కేశవ, ఏవివి సత్యనారాయణ, వల్లూరి వెంకటరమణ, సప్పా అప్పారావు, బసనబోయిన కన్నారావు, వెన్నా సత్యనారాయణ, బొక్కం సింహాచలం, విన్నకోట మోహన్, జి మార్గాన వసంత కుమార్ పిల్లలకు విద్యార్థులకు నోట్స్ బుక్స్ స్వీట్స్ పంపిణీ చేశారు.







# ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలో స్టేట్ ఫస్ట్.. విద్యానిధి విజయకేతనం

**470కి 468 మార్కులు.. స్టేట్ ఫస్ట్‌గా నిలిచిన గంగాదేవి - కోనసీమ కీర్తి పతాక ఎగరవేసిన విద్యానిధి విద్యార్థిని**
**విద్యానిధి జూనియర్ కళాశాలకు మరో రాష్ట్రస్థాయి గుర్తింపు - కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అభినందనలు**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ఫలితాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అమలాపురం విద్యానిధి జూనియర్ కళాశాల మరోసారి తన ప్రతిభను చాటుకుంది. కళాశాలకు చెందిన విద్యార్థిని యాళ్ల బి.టి.ఎస్. గంగాదేవి ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల్లో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం ద్వారా గంగాదేవి తన వ్యక్తిగత ప్రతిభతో పాటు విద్యానిధి జూనియర్ కళాశాల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించింది. ఈ అరుదైన విజయంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కోనసీమ జిల్లాకు ఈ విజయం ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రథమ స్థానం సాధించిన గంగాదేవిని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆమెను సత్కరించి, భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కృషి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైనా అందుకోవచ్చని









పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యానిధి విద్యాసంస్థల చైర్మన్ ఏ.బి. నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక శిక్షణ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థిని సాధించిన ఈ ఘన విజయం మొత్తం విద్యాసంస్థకు గర్వకారణమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.సుధీర్ బాబు మాట్లాడుతూ గంగాదేవి విజయానికి అధ్యాపకుల అంకితభావం, విద్యార్థిని కృషి, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ కొనసాగిస్తామని చెప్పారు. విద్యార్థిని గంగాదేవి తన విజయానికి తల్లిదండ్రులు, అధ్యాపకులు అందించిన ప్రోత్సాహమే బలమని పేర్కొంది. లక్ష్యసాధన కోసం ప్రణాళికాబద్ధంగా చదివానని, అదే తనకు రాష్ట్ర ప్రథమ స్థానం తీసుకొచ్చిందని తెలిపింది. ఈ కార్యక్రమంలో విద్యానిధి విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొని గంగాదేవిని అభినందించారు. రాష్ట్ర ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా కళాశాలలో ఆనందోత్సాహాల నడుమ విద్యార్థిని ఘనంగా సత్కరించారు.

## కుషాల్‌కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని సీబీఎస్ఈ అనుబంధ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థి విత్తనాల కుషాల్ నాగ వెంకట్ అరుదైన ప్రతిభను కనబరిచి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్లో స్థానం సంపాదించాడు. అతి చిన్న వయస్సులోనే అసాధారణ జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, పఠన నైపుణ్యాలను ప్రదర్శించిన కుషాల్, 1 నుంచి 80 వరకు గల స్క్వేర్ నెంబర్లను కేవలం 1 నిమిషం 44.33 సెకన్లలో ఎలాంటి అంతరాయం లేకుండా స్పష్టమైన ఉచ్చారణతో, ఆత్మవిశ్వాసంతో చెప్పి ఈ ఘనతను సాధించాడు. ఈ ప్రదర్శన ద్వారా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపును కూడా పొందాడు. కేవలం 8 సంవత్సరాల 3 నెలల 11 రోజుల వయస్సులోనే ఈ అరుదైన విజయాన్ని సాధించడం అతని అసాధారణ మేధస్సు, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు కుషాల్‌ను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాయుడు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, మను విహార్, స్నేహప్రియ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని కుషాల్‌ను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా అశోక్ బర్త్‌డే వేడుకలు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ 55వ పుట్టిన రోజు వేడుకలను ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నగర టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి టౌన్ అధ్యక్షులు కట్ట సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేక్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అశోక్ తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు కొనియాడారు. అలాగే నీటి సంఘ అధ్యక్షులు సరిపెల్ల శ్రీను రాజు మాట్లాడుతూ అశోక్ నిబద్ధతతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సేవలు అందిస్తూ వెన్ను దన్ను గా ఉంటూ అనేక మైనటువంటి సేవా కార్యక్రమాలు ముందుండే అశోక్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం అన్నారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్ లో పేద రోగులకు పళ్ళు పాలు బ్రెడ్ పంచి పెట్టడం జరిగింది, అనంతరం అన్న క్యాంటీన్లో నగర కమిషనర్ పి రవివర్మ భారీ కేక్ కట్ చేసి అశోక్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం పేదలకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి రమణ కుమార్, టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు జాగు సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ పిల్లి నాగరాజు, రాష్ట్ర అంగన్వాడీ డ్వాక్రా ఆర్గనైజింగ్ సెక్రటరీ మెండి కమల, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు జక్కల ప్రసాద్,యాళ్ల ఉదయ్,చప్పిడి ప్రసాద్, కాశి లాజర్, నిమ్మకాయల విషు, మాజీ ఉపసర్పంచ్ బూరుగు కళ్యాణ్,కటికిదళల నాని, కన్నీడి శివప్రసాద్, ఏళ్ల బాలకృష్ణ, కాశి మూర్తి, మెండి కృష్ణ బాబు, జనపల్లి సత్యనారాయణ, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, కివివి సత్యనారాయణ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడకు కాపు సంఘ నాయకుల ఘన నివాళి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మరణం తీరని లోటని ముమ్మిడివరం నియోజకవర్గం కాపు సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక లంకతల్లి అమ్మ వారి ఆలయం వద్ద జరిగిన సంతాప కార్యక్రమంలో ముద్రగడ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ముద్రగడ ఉద్యమ స్ఫూర్తి వలనే ఈబీసీ, రిజర్వేషన్, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఎందరో రాజకీయ నాయకులుకు పదవులు దక్కాయన్నారు.

## ఉద్యమ ఉక్కుమనిషికి ఉజ్వల నివాళి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమ పితామహుడు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం మరణం కాపు సమాజానికే కాకుండా రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని కాపునాడు జాతీయ ఉపాధ్యక్షుడు గంగుమళ్ల శ్రీను అన్నారు. బుధవారం అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి కాపు హక్కుల సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత నాయకుడు ముద్రగడ అని కొనియాడారు. పదవుల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా ముద్రగడ పద్మనాభం చిరస్థాయిగా గుర్తుండిపోతారని, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కాపునాడు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ ప్రకటనలో తెలిపారు. పరమపదించిన ముద్రగడ పద్మనాభం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు, అభిమానులు, అనుచరులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారిని దర్శించుకున్నా

## తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సి కంచర్ల శ్రీకాంత్ మందపల్లిలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి దేవస్థానం అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదమును అందజేసియున్నారు అనంతరం వీరు శ్రీ స్వామి వారికి 52 శనివారములు ఏకాదశ రుద్ర తైలాభిషేకం నిర్వహించుటకు గాను రూ.31,200/- లు చెల్లించియున్నారని దారపు రెడ్డి సురేష్ బాబు, సహాయ కమిషనర్ మరియు నిర్వహణాధికారి తెలియజేశారు.

# కాలేయ మహమ్మారికి ముందస్తు గుర్తింపే విరుగుడు

**ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుంది - ఆధునిక కాలేయ మార్పిడితో కొత్త జీవితం**
**స్థూలకాయం, మధుమేహం, మద్యపానం, హెపటైటిస్ వైరస్‌లతో పెరుగుతున్న ముప్పు**
**అశాస్త్రీయ, నాటు వైద్యాల బారిన పడొద్దని హెచ్చరిక - ఉభయ గోదావరి ప్రజలకు అత్యాధునిక కాలేయ వైద్య సేవలు అందిస్తున్న యశోద ఆసుపత్రి**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా కాలేయ (లివర్) సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతూ ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతు న్నాయి. లక్షణాలు బయటపడే సమయానికి వ్యాధి ముదిరిపోయే పరిస్థితులు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో, కాలేయ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని యశోద ఆసుపత్రి (హైటెక్ సిటీ) గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ విభాగ నిపుణులు తెలిపారు. అమలాపురంలో ఎ బి సి డి హోటల్ నందు యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కాలేయ ఆరోగ్య అవగాహన సదస్సులో కాలేయ వ్యాధుల కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలు, ఆధునిక చికిత్సా విధానాలపై సమగ్రంగా వివరించారు.ప్రస్తుతం స్థూలకాయం, మధుమేహం, అధిక మద్యపానం, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి వైరస్‌లు, నియంత్రణ లేకుండా దీర్ఘకాలం మందులు వాడటం వంటి కారణాలతో కాలేయం దెబ్బతింటోందని వైద్య నిపుణులు తెలిపారు. ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా మంది వ్యాధిని నిర్లక్ష్యం చేస్తున్నారని, చివరకు సిర్రోసిస్, కాలేయ వైఫల్యం, కాలేయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కాలేయం దెబ్బతిన్నప్పుడు కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారడం (జాండిస్), పొట్ట లేదా కాళ్లు ఉబ్బడం, రక్తపు వాంతులు కావడం, నల్లటి మలం




రావడం, తీవ్రమైన అలసట, విపరీతమైన నిద్ర, గందరగోళం, ఆకలి తగ్గిపోవడం, బరువు అకస్మాత్తుగా తగ్గడం, శరీరమంతా తీవ్రమైన దురద వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ లక్షణాలను చిన్న సమస్యగా భావించకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సూచించారు. కాలేయ వ్యాధులను కేవలం సాధారణ అల్ట్రాసౌండ్ పరీక్షలతోనే అంచనా వేయడం సరిపోదని, అవసరాన్ని బట్టి అధునాతన రక్తపరీక్షలు, ఫైబ్రోస్కాన్, ఎండోస్కోపీ, సీటీ, ఎంఆర్ఐ వంటి ఆధునిక పరీక్షల ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ అవసరమని వివరించారు. ఆలస్యం చేస్తే కాలేయం పూర్తిగా దెబ్బతిని చికిత్స కూడా క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బరువును నియంత్రణలో ఉంచుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండడం, హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేయించుకోవడం, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా కాలానుగుణంగా చేయించుకోవడం ద్వారా కాలేయ వ్యాధులను ముందుగానే గుర్తించి పూర్తిస్థాయిలో నియంత్రించవచ్చని తెలిపారు. కాలేయం పూర్తిగా దెబ్బతిన్న రోగులకు ప్రస్తుతం కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంట్) అత్యంత ప్రభావవంతమైన చికిత్సగా మారిందన్నారు. ఒకప్పుడు అత్యంత క్లిష్టంగా భావించిన ఈ శస్త్రచికిత్సలు నేడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన వైద్య బృందాల సహకారంతో అత్యంత సురక్షితంగా విజయవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. యశోద ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ దాతల నుంచి మాత్రమే కాకుండా, ప్రాణాలతో ఉన్న ఆరోగ్యవంతమైన కుటుంబ సభ్యుల నుంచి కూడా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలేయానికి తిరిగి పెరిగే అద్భుతమైన పునరుత్పత్తి శక్తి ఉండటంతో దాతలు కూడా సాధారణ జీవితాన్ని కొనసాగించగలరని వివరించారు. సమయానికి చికిత్స తీసుకుంటే కాలేయ మార్పిడి అనంతరం రోగులు తిరిగి సాధారణ జీవితం గడపగలరని చెప్పారు. అలాగే నాటు వైద్యం, అశాస్త్రీయ చికిత్సలు, మూలికల పేరుతో విక్రయించే నిర్ధారణ లేని మందులను నమ్మి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి చికిత్సల వల్ల ఇప్పటికే దెబ్బతిన్న కాలేయం మరింతగా క్షీణించి ప్రాణాపాయం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు అత్యాధునిక కాలేయ వైద్య సేవలు, అత్యుత్తమ నిర్ధారణ పరీక్షలు, నిపుణుల సలహాలు, క్లిష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు ఒకే వేదికపై అందించేందుకు యశోద ఆసుపత్రి నిరంతరం కృషి చేస్తోందని ప్రతినిధులు తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, చిన్న లక్షణాలు కనిపించినా వెంటనే నిపుణులను సంప్రదిస్తే కాలేయ వ్యాధులను పూర్తిగా నియంత్రించవచ్చని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో యశోద ఆసుపత్రి కోస్తా ప్రాంత ప్రతినిధులు వి.సాయి కిరణ్, ఎస్.వి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

### కొంకాపల్లిలో ముద్రగడకు

## కొవ్వొత్తులతో ఘన నివాళి




**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపంగా అమలాపురం రూరల్ కొంకాపల్లి గ్రామంలో గ్రామస్తులు, స్థానిక నాయకులు, కాపు యువత కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కాపు సమాజం కోసం ఆయన చేసిన సేవలు, ఉద్యమాలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు.

### ముమ్మిడివరం నియోజకవర్గ

## సాగునీటి పరిస్థితులపై సమీక్ష సమావేశం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని సాగునీటి పరిస్థితులు, రైతులకు నీటి సరఫరా మరియు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై గౌరవ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు నీటి సంఘం అధ్యక్షులు, జలవనరుల శాఖ (ఇరిగేషన్) డీఈతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో సాగునీటి సరఫరా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువల నిర్వహణ, నీటి వినియోగంపై నిరంతర పర్యవేక్షణ, అవసరమైన మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు ప్రతి రైతుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా నీటి పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి, పంటలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నీటి సంఘాల అధ్యక్షులు, జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.



# పెద్దాపురం డీడీఓగా కర్రె స్వప్న నియామకం

## పిఠాపురం ఎంపీడీఓగా విశేష సేవలకు గుర్తింపు
## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన స్వప్న



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా సమర్థవంతమైన పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా కర్రె స్వప్నకు పదోన్నతి లభించింది. ఆమెను ప్రభుత్వం పెద్దాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ)గా నియమించింది. ఈ పదోన్నతి పట్ల అధికార వర్గాలు, సహోద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతి అనంతరం బుధవారం కర్రె స్వప్న కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, పారదర్శకతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డిడిఓ కర్రె స్వప్న, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. కర్రె స్వప్న పదోన్నతి సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేసి, కొత్త బాధ్యతల్లో విశేష విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి కోనసీమ

# జిల్లా అధ్యక్షుడిగా మోర్త దొరబాబు నియామకం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి (ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ) కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా గంగవరం మండలం, దంగేరు గ్రామానికి చెందిన శ్రీ మోర్త దొరబాబును నియమిస్తూ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఈరోజు ఉదయం నుంచి డిసెంబర్ 31, 2028 వరకు ఈ నియామకం అమల్లో ఉంటుందని నియామక పత్రంలో పేర్కొన్నారు. సొసైటీస్ చట్టం కింద రిజిస్ట్రేషన్ నం. 161/2013తో నమోదైన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షుడిగా మోర్త దొరబాబును నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మోర్త దొరబాబుకు సంస్థ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుల్లా రాజారావు సూచించారు.నియామకంపై మోర్త దొరబాబు హర్షం వ్యక్తం చేస్తూ, సంస్థ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి

## స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి: టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఉండవెల్లి శివ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పొడిగించిన నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, కొత్త ఓటర్ల నమోదుతో పాటు అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను కూడా పూర్తిచేయాలని సూచించారు. రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి వర్గానికీ న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో పట్టణ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో క్లస్టర్-1 ఇన్‌చార్జి మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్--2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, సలాది నాయుడు, పదం మూర్తి, ఏలూరు ఏసుదాసు, గడి గోవింద్, నారపురెడ్డి బలరాం, జాస్తి విజయలక్ష్మి, బల్ల లక్ష్మి, మేడిశెట్టి మహలక్ష్మి, వినోద్ చౌదరి, గడి జగన్‌తో పాటు క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులు, కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## అన్ని వర్గాల సంక్షేమం, ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యం



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజక వర్గంలోని ద్రాక్షారామం గ్రామంలో మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆషూర్ ఖానాలు, పీర్ల పంజాలకు కూటమి ప్రభుత్వం తరఫున వక్ఫ్ బోర్డు ద్వారా విడుదలైన రూ. 1,10,000 నిధులను వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా ముస్లిం పెద్దల సమక్షంలో పంపిణీ చేశారు. గ్రామంలోని మొత్తం 22 పంజాలకు ఒక్కొక్కటికి రూ.5,000 చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ముస్లిం సోదరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి సంక్షేమం, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. మొహరం వంటి పవిత్ర పర్వదినాలను ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. సామరస్య వాతావరణంలో అన్ని మతాల ప్రజలు సంతోషంగా జీవించాలనేదే కూటమి ప్రభుత్వ సంకల్పం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ముక్రం, సయ్యద్ ఫాసిల్, ఇబ్నే హుస్సేన్, అస్కరి మౌలానా, మైనారిటీ నాయకులు జాఫర్ హుస్సేన్, మీర్జాన్ హుస్సేన్, చేదువాడ బాబు, ఆగాగని, నాజర్ హుస్సేన్, బాబి, ముజఫర్ హుస్సేన్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నవాబ్ అల్లావుద్దీన్, రామచంద్రపురం పట్టణ మైనారిటీ అధ్యక్షుడు అలీషా తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాల విద్యార్థికి

# జాతీయ స్థాయి స్వర్ణ పతకం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలోని లోణావాలా, ఐఎన్ఎస్ శివాజీలో మహారాష్ట్ర డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత నౌ సైనిక్ క్యాంప్-2026 పోటీలలో రామచంద్రపురం వి.ఎస్.ఎం స్వయంప్రతిపత్తి కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి బంగారు పతకం సాధించారు. దేశంలోని అన్ని ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుండి ఎంపికైన కేడెట్లు పాల్గొన్న ఈ జాతీయ క్యాంపులో నిర్వహించిన ఆరోగ్య, పరిశుభ్రత పోటీలలో కాకినాడ గ్రూప్ నావల్ వింగ్, 6(ఎ) నావల్ యూనిట్ ఎన్‌సీసీ కేడెట్ కె.వి.పి. సంతోష్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌తో పాటు కాకినాడ గ్రూప్‌నకు, కళాశాలకు గర్వకారణంగా నిలిచిన సంతోష్‌ను కళాశాల ఉపాధ్యక్షులు ఎం. ఎస్. ఎన్. మూర్తి, ప్రధానాచార్యులు డాక్టర్ అలీ అన్సారీ, అధ్యాపకులు, ఎన్‌సీసీ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారి ఆలయ

# హుండీ ఆదాయం రూ. 31.10 లక్షలు



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం హుండీల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. గత మార్చి 26 నుండి జూలై 15 వరకు (మొత్తం 112 రోజులకు) గాను ఆలయ జనరల్ హుండీల ద్వారా రూ. 31,10,803 నగదు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని మీడియాకు తెలిపారు. అలాగే అన్నదానం హుండీ ద్వారా రూ. 92,259 నగదుతో పాటు, భక్తులు సమర్పించిన 6.100 గ్రాముల బంగారం, ఒక కేజీ 545 గ్రాముల వెండి లభ్యమైనట్లు వివరించారు. ఈ లెక్కింపు ప్రక్రియ అమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పి. వి. కుమార్, వెల్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వై. సత్యనారాయణ సమక్షంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ద్రాక్షారామ పోలీస్ సిబ్బంది, దేవస్థాన సేవా సిబ్బంది, ప్రముఖులు అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, స్థానిక భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

# అభివృద్ధి కమిటీ సమావేశం



**వెల్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిటీ చైర్మన్, ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి భవాని మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని, ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు (నార్మల్ డెలివరీలు) జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. వైద్య సేవలను మరింత వేగవంతం చేసేందుకు కొత్త ఓపీ స్లిప్పులను ముద్రించాలని, ఆసుపత్రిలో ఆన్లైన్ సేవల కోసం ఇంటర్నెట్ వైరింగ్, కంప్యూటర్ల ఏర్పాటును పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలను తప్పనిసరిగా ఆన్లైన్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.శివ ప్రసాద్, గ్రామ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు వి.స్వాతి భవాని, వి.లక్ష్మి ప్రసన్న, డివిజనల్ సూపర్వైజర్ జి.కమల్ శేషు, సూపర్వైజర్లు జి.రత్నం, డి.వైకుంఠ రావు, క్లరికల్ సిబ్బంది టి.ప్రశాంతి, ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురం మండలంలో

# వైభవంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



**చోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం మండలంలోని చోడవరం, యనమదల గ్రామాలలో ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్ మాట్లాడుతూ, ప్రతి వారం మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన, నీటిపారుదల వంటి అనుబంధ శాఖలన్నీ ఇందులో పాలుపంచుకుంటూ రైతుల సమస్యలను సేకరించి తగిన ప్రణాళికలు రూపొందిస్తాయని వివరించారు. ప్రస్తుతం వర్షపాతం లోటు వల్ల అక్కడక్కడ నీటి ఎద్దడి ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న కాలువ నీటి సదుపాయాన్ని వాడుకుంటూ నారుమళ్లు లేదా వెదజల్లే పద్ధతుల ద్వారా త్వరితగతిన సాగు పనులు పూర్తి చేయాలని సూచించారు. మండలంలో సాగుకు సరిపడా ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు ప్రత్యేక యాప్ ద్వారా 5,517 మంది రైతులకు 701 మెట్రిక్ టన్నుల యూరియా, 194 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ ద్వారా పంట బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. హెక్టారుకు రూ.190, అనగా ఎకరానికి రూ.76 చొప్పున ప్రీమియం చెల్లించి రైతులు పంట బీమా నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం అందుతుందని పేర్కొన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకుల ద్వారానే ఈ ప్రీమియం కట్ అవుతుందని, రుణాలు లేని సొంత రైతులు లేదా కౌలు రైతులు నేరుగా మీ సేవా కేంద్రాలకు వెళ్లి పట్టాదార్ పాస్ పుస్తకం లేదా కౌలు కార్డు, ఆధార్ కార్డు సమర్పించి ఈ ప్రీమియం చెల్లించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు జగదీష్, మణికంఠ, గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న రిపోర్టర్‌కి

# ఆర్థిక సాయం అందించిన మంత్రి వాసంశెట్టి





**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక పత్రిక రిపోర్టర్ ప్రభాకర్ కి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వంతో ఆదుకున్నారు. విలేకరి ఆరోగ్య పరిస్థితి మరియు చికిత్స నిమిత్తం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న మంత్రి, వెంటనే స్పందించి బాధితునికి ?20,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అధైర్యపడకుండా మెరుగైన వైద్యం చేయించుకోవాలని, ఆరోగ్య విషయాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న తోటి జర్నలిస్టుకు మంత్రి తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించడం పట్ల స్థానిక విలేకరులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి సుభాష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ముగిసిన శ్రీ అగస్త్రేశ్వర స్వామివారి

# దివ్య కళ్యాణ మహోత్సవాలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ అగస్త్రేశ్వర స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆలయంలో స్వామివారి శ్రీ పుష్పోత్సవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు వీరావధాని బ్రహ్మత్వంలో, ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక ఎర్రయ్య శాస్త్రి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం వేళ అక్కిరాజు గారి భక్తి సంగీత విభావరి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన శ్రీ పుష్పోత్సవంలో నియోజకవర్గ నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ముగింపు వేడుకల్లో ఆలయ ఈవో సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, పాలకమండలి సభ్యులు వెంకట వరహగిరి, సుతాపల్లి వీరబాబు, బద్రి, ఆదివరపు దుర్గాప్రసాద్, వాసంశెట్టి సత్యనారాయణ, శాఖ వీరన్న, లంక సత్యనారాయణ, సత్యవాడ శ్రీహరిపంతులు మరియు ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



విశ్వం వాయిస్ NEWS
నిజం దాగదు.. అక్షరం ఆగదు..!

# నిద్రపోతున్న, ఇరిగేషన్ ఆర్ & బి అధికారులు..







మనీ మత్తులో అధికారులు... నాయకులకు పని చేస్తున్నారా..? ప్రభుత్వానికి పనిచేస్తున్నారా..?

- దేశానికి రైతే వెన్నుము అన్న ప్రభుత్వం రైతు పంట పొలాల కాలువను కబ్జా చేస్తున్న ఏం చేస్తుంది..
- హైతే లోనే స్థలాన్ని టార్గెట్ చేస్తున్న కబ్జాదారులు
- చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఎందుకు పట్టించుకోవడం లేదు ప్రజల్లో అనుమానాలు







అధికారులకా డబ్బు ముఖ్యం? ప్రజల బాధ పట్టదా?

**గోకవరం, విశ్వం వాయస్ న్యూస్ జూలై 16:**

గోకవరం నుంచి రాజమండ్రి వెళ్లేవైపు ఆర్ అండ్ బి స్థలాలను కబ్జా చేసి దుకాణాలు నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అంతేకాక ఒక రైతు తమ పంట పొలాన్ని నమ్ముకుని జీవిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు అలాంటి రైతుని బ్రతకనివ్వకుండా కొంతమంది కబ్జాదారులు రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలకు వెళ్తున్న కాలువలను పూడ్చి దుకాణాల నిర్మిస్తూ.. ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వీటికి పాల్పడేది బాగా పేద మనుషులు కాదు పార్టీలకు సంబంధించిన నాయకులేనని ప్రజలు చెబుతున్నారు. మరోవైపు ప్రకృతిని నాశనం చేస్తూ రానున్న రోజుల్లో ప్రమాదాలకు కారణమైన ఆకాశానికి తాకుతున్నట్టు నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్న అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీనంతటికీ కారణం డబ్బు అధికారులకు డబ్బులు ఇస్తే ఎలాంటి దుర్మార్గాల కైనా పాల్పడతారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏరి కోరి పంచాయతీ రాజ్ ను ఎంచుకున్న డిప్యూటీ సీఎం కొనెదల పవన్ కళ్యాణ్ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నలు ప్రజల్లో చెక్కర్లు కొడుతున్నాయి. ఇలా ప్రభుత్వ భూములు రైతుల వంటకాలు కబ్జాలు చేసుకుంటూ పోతే కొన్ని సంవత్సరాలకు గోకవరం గూగుల్లో చూసుకునే పరిస్థితి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నో పత్రిక కథనాల్లో ప్రభుత్వ భూములు అలాగే ఇరిగేషన్ కి సంబంధించిన భూములు కబ్జాలు అయిన ఇప్పటికి అధికారులు వచ్చి దానిపై విచారణ చేయకపోవడం దురదృష్టకరమని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. ఒకటవ తారీకు వస్తే జీతాలు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ అధికారులు రైతులకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు ముందుకు రావడం లేదు గోకవరం నుంచి రాజమండ్రి వైపుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలను పూర్తిగా చదును చేసి వాటిపై దుకాణాలు నిర్మించారు. ఇలానే జరుగుతే మన గోకవరం కూడా కొన్ని సంవత్సరాల తరువాత మరో విజయవాడ గా తయారవుతుంది. నాయకులు పార్టీలకి వచ్చి ప్రజలకు ఏం చేస్తున్నారు తమ ఆస్తులను కాపాడుకోవడానికి ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ మాదే అంటూ ముందుకు పోతున్నారు. ప్రజలు అన్ని చూస్తున్నారు ఈసారి వారికి సరైన గుణపాఠం చెబుతారు అని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం దగ్గర డబ్బు తీసుకుంటూ ప్రజల కోసం పనిచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అవినీతి అధికారులపై అధికారులు నిఘా పెట్టాలని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే గాని అగ్రైత్యాలు ఆగవని ప్రజలు కోరుకుంటున్నారు.

**డబ్బు కోసం కాదు... ప్రజల కోసం పనిచేయండి అధికారులు! గోకపరం భవిష్యత్తు కాపాడండి!**

కాపు ఉద్యమనేత ముద్రగడకు

# అంతిమ వీడ్కోలు : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు ఉద్యమనేత కాపు జాతి అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ముద్రగడ మృతి కాపు జాతికి రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ అన్నారు.బుధవారం బత్తుల కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం భౌతికకాయాన్ని సందర్శించి, ఆయన పార్థివదేహం వద్ద పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ముద్రగడ ఏ విషయాన్నైనా ముక్కుసూటిగా మాట్లాడే వారిని,అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా కాపు సామాజికవర్గం హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరి గుండెల్లో సజీవ శిల్పాలుగా ఉంటాయన్నారు.రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నా, ప్రజా సమస్యల పై ఆయనకున్న నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకం. ముద్రగడ మృతి యావత్ కాపు జాతికి, రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు యర్రంశెట్టి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

# పశుగ్రాస వార్షికోత్సవాలు



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాడి పరిశ్రమ లాభసాటిగా సాగాలంటే పచ్చిమేత ఎంతో కీలకమని ప్రతి రైతు తనకున్న భూమిలో కనీసం 10 శాతం విస్తీర్ణంలో సాగు చేయాలని కోరుకొండ ప్రాంతీయ పశు వైద్యశాల ఏడి డాక్టర్ పి.ప్రభావతి అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగింది. వర్ష భవ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి రైతు పిఎండిఎస్ ద్వారా పశుగ్రాసా కొరతను నివారించాలని డాక్టర్ ప్రభావతి చెప్పారు. పాడికి పచ్చిమేత ఆధారమని గోకవరం మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.లోకేష్ తెలియజేశారు. రోజుకు ఒక పశువుకు 30 నుండి 40 కిలోల పచ్చిమేత కావాలని, పచ్చిమేత లేనిదే పాడి పరిశ్రమ ఎప్పుడూ లాభసాటి కదానారు. పిఎండిఎస్ లో భాగంగా జనుము, పిల్లిపెసర, మిశ్రమ గడ్డి రకాలు వేసుకోవాలి. వీటిద్వారా పాడిరైతుకు ఆదాయం, పశువుకు మేత భూమిని సారావంతంగా ఉంచుతుంది. ఎర్రంపాలెం పశువైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణనాయుడు మాట్లాడుతూ వీ+చీ=జు+నా లో రైతులు పశు గ్రాసాన్ని పెంచుకోవలనీ సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా త్వరలో 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు పాలుఇచ్చే రైతుల ఉత్పాదకతను పెంచేందుకు 50 శాతం రాయితీతో మిశ్రమ సమీకృత దాన ధర 1110 రూపాయలు,50 కేజీల దాన బస్త ధర 555 రూపాయలకే అందజేస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో ప్రాంతీయ పశువైద్యాధికారి డాక్టర్ పి. ప్రభావతి మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.లోకేష ఎర్రంపాలెం పశువైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణనాయుడు ప్రకృతి వ్యవసాయ రైతు కోరుపలీ అప్పలస్వామి ఇతర పాడిరైతులు పాల్గొనారు.

# గొప్ప నాయకుడిని కోల్పోయాం


## మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా - ముద్రగడ అంత్యక్రియలకు ప్రభుత్వ లాంఛనాలు అవసరం లేదని వెల్లడి



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీమంత్రి ముద్రగడ పద్మనాభంను ఎన్నో రకాల ఇబ్బందులకు గురిచేసి, ఆయన మానసిక శోభకు కారణమైన ప్రభుత్వం ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ముద్రగడ స్వగ్రామం కిర్లంపూడిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముద్రగడ అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహి స్తామని, పోలీస్, ఇతర అధికారుల చేత రాయ బారం చేస్తున్నారని రాజా పేర్కొన్నారు. ముద్రగడ అంత్యక్రియలకు ప్రభుత్వ లాంఛనాలు అవసరం లేదని కుటుంబ సభ్యుల మాటగా తాము ప్రకటిస్తున్నామన్నారు. ఒక గొప్ప నాయకున్ని కోల్పోయామని, ముద్రగడ వంటి నాయకులు అరుదుగా పుడతారన్నారు. అనేక పోరాటాలు ఉద్యమాలు సాగించిన పద్మనాభం కాపు సామాజిక వర్గానికే కాకుండా ఎస్సీ, బీసీ, నాన్నగారిని వర్గాలకు చెందిన వారు కూడా అభిమానులను సంపాదిం చుకున్న మహో న్నత వ్యక్తి అన్నారు. కిర్లంపూడిలో అంబేద్కర్ నిల్వ విగ్రహాన్ని ముద్రగడ ఏర్పాటు చేయించారన్నారు. ప్రేమ ఆప్యాయత అనురాగాలకు ఆయన ప్రతిరూపమన్నారు. దూరం నుంచి చూసిన నాయకులకు ఆయన వ్యక్తిత్వం అర్థం కాకపోయి నప్పటికీ దగ్గర నుంచి చూసే వాళ్లకు ఆయన మనస్తత్వం, ఆయనలో దాగి ఉన్న ప్రేమానురాగాలు, ఎమో షన్స్, ఆప్యా యతలు కనిపిస్తాయి అన్నారు. ఆయన లేని లోటు ఈ ప్రాంత ప్రజలకే కాకుండా రాష్ట్రానికి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం వాటిలిందన్నారు. మాజీ మంత్రి తోట నరసింహం, కాకినాడ సిటీ మాజీ ఎమ్మె ల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, పెద్దాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దౌలూరి దొరబాబు, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారులను

# ప్రభుత్వం ఆదుకోవాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక సీపీఐ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు ఎల్.ఆర్. కృష్ణబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు రాష్ట్రంలోని 28 జిల్లాల నుండి సుమారు 100 మందికి పైగా జానపద కళాకారుల సంఘ ప్రతినిధులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, యువ కళాకారులు హాజరై కళారంగ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్ ఆరోగ్య కారణాల దృష్ట్యా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సమావేశంలో ప్రకటించారు. ఆయన కళారంగానికి అందించిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర కమిటీ ఆయనను ఘనంగా సత్కరించింది.ఈ సమావేశాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. బుచ్చిబాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వీర్నాల కృష్ణ సుబ్రహ్మణ్యం. సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు బొడ్డు బుల్లెబ్బాయి, మహంతి లక్ష్మణరావు, తాళ్ల రవీంద్రబాబు, ముని శంకర్, తోట పవన్ కుమార్, పల్లి డేనియల్, ఎం. ప్రేమానందం, వేమవరపు రాంబాబు, శివజ్యోతి, లింగం శారద తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి విజ్ఞానాన్ని పెంచేందుకు సైన్స్ పోటీలు దోహదం

## ఎమ్ఈవో సుబ్రహ్మణ్యం - విద్యార్థి విజ్ఞాన్ మంథన్ -2026 కరపత్రం ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సిఈఆర్టి), ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న విద్యార్థి విజ్ఞాన్ మంథన్ -2026 పోటీలకు అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సాహించాలని రాజమహేంద్రవరం అర్బన్ ఎంఈఓ ఎంవిఎం సుబ్రహ్మణ్యం ప్రధానోపాధ్యాయులను కోరారు. స్థానిక ఎస్కేవిటీ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ -2026 కరపత్రం ఆవిష్కరించారు. సంబంధిత వెబ్సైట్ https://vvm.org.inలో అన్ని స్కూల్స్ రిజిస్టర్ అవ్వాలన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండల అధికారి చందుకుమార్ మాట్లాడుతూ పోటీలలో పాల్గొనుటకు 6వ తరగతి నుండి 11వ తరగతి వరకు చదువుచున్న విద్యార్థులు అర్హులని,నమోదు గడువు 2026 సెప్టెంబర్ 30 వరకు ఉంటుందని, ప్రతి పాఠశాల నుండి విద్యార్థులను పాల్గొనేటట్లు చూడాలన్నారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లో పాల్గొనే విద్యార్థులకు, పాఠశాలలకు జాతీయస్థాయిలో ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్, ఇస్రో, సి ఎస్ ఆర్ ల్యాబ్స్, సైన్స్ మ్యూజియం సందర్శించడానికి, అనేక జాతీయ సైన్స్ పోటీలలో పాల్గొనడానికి అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డిసిఈబి చైర్మన్ దేవా అనిత, విద్యార్థి విజ్ఞాన్ మంథన్ -2026 జోనల్ ఆంధ్రా తెలంగాణ్ కోఆర్డినేటర్ మేకా సుసత్య రేఖ, వివిఎం అంబాసిడర్లు ఫణి కుమార్ రామ్మోహన్, శాంతి కుమారి పాల్గొన్నారు. వివరాలకు 8179491911, 8074768665, 9908600998, 8143162338 నెంబర్లను సంప్రదించవచ్చని మరియు https:/vvm.org.in వెబ్సైట్ నందు సమాచారం పొందవచ్చు అన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# ‘ఓ..! సుకుమారి’ మీ అందరికీ తప్పకుండా నచ్చుతుం

## హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్



‘ఓ.! సుకుమారి’ ప్రేమతో చేసిన మంచి సినిమా అని హీరో తిరువీర్ తెలిపాడు. ఈ మూవీ అందరికీ నచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని, జూలై 17న థియేటర్స్ లో చూసి పెద్ద హిట్ చేయాలని ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ లో కోరాడీ ట్యాలెంటెడ్ హీరో. యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ‘ఓ.! సుకుమారి’తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా ‘శివం భజే’ తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్స్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో తిరువీర్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ‘మసూద’ సినిమాకి, ఈ సినిమాకి కొన్ని ఆసక్తికరమైన పోలికలు ఉన్నాయి. ‘మసూద’ సినిమాను ఎస్‌వీసీ రిలీజ్ చేసింది. ఈ సినిమాను కూడా ఎస్‌వీసీనే విడుదల చేస్తోంది. అందులో నా జోడీగా నటించిన అమ్మాయి పేరు మినీ. ఇందులో నా జోడీగా నటించిన అమ్మాయి పేరు దామిని. (నవ్వుతూ) మహేశ్వర్ రెడ్డి గారు ప్రతి విషయాన్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు. ఈ సినిమా ద్వారా నాకు ఒక మంచి కుటుంబం దొరికినట్టుగా అనిపించింది. దర్శకుడు, నటీనటులు, టెక్నీషియన్స్ అందరూ ఎంతో ఫ్రెండ్లీగా ఉండేవారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇప్పుడు నాకు సొంత బ్యానర్‌లా అనిపిస్తోంది. నిన్ననే సినిమా చూశాను. ఈ సినిమాకు అసలు హీరో మా మ్యూజిక్ డైరెక్టర్ భరత్. పాటలతో పాటు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఇచ్చాడు. దర్శకుడు భరత్ దర్శన్‌కు, సంగీత దర్శకుడు భరత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. నాకు చాలా మంచి సినిమా ఇచ్చారు. మా ఎడిటర్‌తో పాటు టెక్నికల్ టీమ్ అంతా ఎంతో ప్యాషన్‌తో పనిచేశారు. ఇది ప్రేమతో, కష్టపడి చేసిన సినిమా. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది. ఐశ్వర్య గారికి నేను అభిమానిని. ఆమెతో రెండోసారి కలిసి నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది. మా నిర్మాత గారికి ఈ సినిమా ద్వారా మంచి లాభాలు రావాలి. ఆయన ఇలాంటి మంచి సినిమాలు మరెన్నో తీయాలి. మాకందరికీ రెగ్యులర్‌గా పని ఉండాలి. ఇండస్ట్రీ బాగుండాలి. థ్యాంక్యూ’ అని అన్నారు. హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... ‘సంక్రాంతికి వస్తున్నాం’ తర్వాత ‘ఓ.! సుకుమారి’ తో ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. జూలై 17న సినిమా విడుదలవుతోంది. ముందుగా మా నిర్మాత మహేశ్వర్ రెడ్డి గారి గురించి చెప్పాలి. ఆయన ఈ కథను ఎంతో నమ్మారు. ఒక చిన్న సినిమాను పెద్ద సినిమాలా తీర్చిదిద్దడానికి ప్రతి ప్రయత్నం చేశారు. ఈ సినిమా ఆయనకు చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అందరం కలిసి సక్సెస్ పార్టీ చేసుకోవాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. దర్శన్‌కు ఆల్ ది బెస్ట్. తిరువీర్ గారితో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. మా సినిమాటోగ్రాఫర్ ఎంతో అందంగా చూపించారు. మ్యూజిక్ డైరెక్టర్ భరత్ అద్భుతమైన సంగీతం అందించారు. పాటలన్నీ చాలా బాగా వచ్చాయి. నేను అమెరికాలో ఉన్నప్పుడు ఒక కారులో ప్రయాణిస్తుండగా ఈ సినిమా పాటలు వరుసగా దాదాపు పది సార్లు వినిపించాయి. ప్రతి పాట అద్భుతంగా ఉంది. భరత్‌కు చాలా మంచి భవిష్యత్తు ఉంది.మా సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది. అందరూ చూసి ఆదరించాలి’ అని కోరారు. దర్శకుడు భరత్ దర్శన్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ఈ సినిమాపై నాకు డబుల్ కాన్ఫిడెన్స్ ఉంది. జూలై 17న థియేటర్లలో కలుద్దాం. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత తిరువీర్, ఐశ్వర్య రాజేష్‌ల నటనను మీరు చాలా కాలం గుర్తుంచుకుంటారు. వాళ్ల పెర్ఫార్మెన్స్ పీక్స్‌లో ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత మహేశ్వర్ రెడ్డి గారికి ధన్యవాదాలు. మా డీవోపీ, ఎడిటర్, టెక్నికల్ టీమ్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఈ సినిమా ప్రేక్షకులను పూర్తి స్థాయిలో అలరిస్తుంది. వినోదానికి ఎలాంటి లోటు ఉండదు’ అని పేర్కొన్నారు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ‘అందరికీ నమస్కారం. మేం చాలా మంచి సినిమా తీశాం. ఈ సినిమాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. జూలై 17న సినిమా విడుదలవుతోంది. అందరూ థియేటర్లలో చూసి ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను’ అని పేర్కొన్నారు. నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ.. ‘ఇది మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన సినిమా. దర్శకుడు తొలి సినిమానే అయినా చాలా అద్భుతంగా తీశారు. అందరూ సినిమా చూసి ఆనందించండి, మమ్మల్ని ఆశీర్వదించండి.




ఆమె తెలుగులో తోపు హీరోయిన్. నాగార్జున, బాలకృష్ణ, రవితేజ, తరుణ్, వెంకటేశ్ వంటి స్టార్ హీరోలతో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో నటించింది. ప్రస్తుత సినిమాలకు దూరంగా ఉన్న ఆహీరోయిన్.. తమిళనాడు సీఎం విజయ్ దళపతి భార్యగా, తల్లిగా, ప్రియురాలిగా నటించింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు గెలుచుకుని విజయ్ తమిళనాడు విక్టరీ పార్టీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా విధులు నిర్వహిస్తున్నారు విజయ్. ఇదిలా ఉంటే.. ‘జననాయకన్’ తన చివరి చిత్రమని, ఇకపై సినిమాల్లో నటించనని చెప్పి రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్, తమిళనాడు అసెంబ్లీలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం విజయ్ నటించిన జన నాయగన్ చిత్రం జూలై 23న థియేటర్లలో విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. అతని సినీ కెరీర్ ఎప్పుడూ అభిమానులకు చాలా దగ్గరగా ఉంది. నటి త్రిష ‘గిల్లి’, ‘తిరుపాచ్చి’, ‘ఆది’, ‘కురువి’, ‘లియో’, ది గోట్ వంటి చిత్రాల్లో నటించింది. అయితే మీకు తెలుసా.. విజయ్ సరసన భార్యగా, ప్రియురాలిగా, తల్లిగా నటించిన ఏకైక హీరోయిన్ ఎవరో. ఆమె మరెవరో కాదు..హీరోయిన్ స్నేహ. ‘వసీకర’ అనేది 2003లో సెల్వ భారతి దర్శకత్వం వహించిన చిత్రం. ఈ చిత్రంలో స్నేహ విజయ్ భాగస్వామిగా నటించాల్సి ఉంది. సినిమా ప్రారంభంలో స్నేహితురాలిగా నటించిన స్నేహ, సినిమా చివర్లో భార్య పాత్రలో కనిపిస్తుంది. ఈ సినిమా విడుదలై 21 ఏళ్ల తర్వాత, విజయ్ , స్నేహ ‘ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్’ చిత్రం కోసం మళ్లీ జతకట్టారు. ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహించారు. విజయ్‌తో పాటు ప్రభుదేవా, ప్రశాంత్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో విజయ్, తండ్రి గాంధీ కొడుకు జీవన్ పాత్రలను పోషించారు. ఇందులో స్నేహ, ఫాదర్ గాంధీకి భార్యగా , జీవన్‌కు తల్లిగా నటించింది. దీని ద్వారా, స్నేహ విజయ్‌కి తల్లి, భార్య , ప్రియురాలు అనే మూడు పాత్రలు పోషించింది. వీరిద్దరి కాంబో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ‘ది కోడ్’ సినిమా రూ.450 కోట్ల వరకు వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. స్నేహతో పాటు, విజయ్‌కి తల్లి , భార్య పాత్రను మరో నటి పోషించారు. ఆమె ఎవరో మీకు తెలుసా? – ఆమె నటి నిత్యా మీనన్. అట్లీ దర్శకత్వం వహించిన ‘మెర్సల్’ చిత్రం 2017లో థియేటర్లలో విడుదలై మంచి ఆదరణ పొందింది. ఈ చిత్రంలో విజయ్ తండ్రి , ఇద్దరు కొడుకులుగా 3 పాత్రలు పోషించారు. ఆ చిత్రంలో నిత్యా మీనన్, తండ్రి వెట్రీకి తల్లిగా , మారన్‌కి తల్లిగా నటించారు.

# ఆటను మరింత ఆసక్తికరంగా మార్చేలా.. మెగా టోర్నీల్లో ఐసీసీ కీలక మార్పులు

ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచ కప్, టీ20 వరల్డ్ కప్ నిర్మాణంలో సమూల మార్పులను చేస్తున్నట్లు ఐసీసీ ప్రకటించింది. 14 జట్లు తలపడే వన్డే వరల్డ్ కప్‌లో మూడు దశల ఫార్మాట్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపింది. ఇక పొట్టి కప్‌లోనూ ‘సూపర్ 10’ను విస్తరించనుంది. ఇందులో ఎలిమినేటర్ దశ కూడా ఉంటుంది. ఈ మేరకు ఎడిన్‌బర్గ్ వేదికగా జరిగిన ఐసీసీ వార్షిక కాన్ఫరెన్స్‌లో నిర్ణయం తీసకుంది. పోటీని మరింత ఆసక్తికరంగా మార్చడంతోపాటు క్రికెటర్లకు, అభిమానులకు సరికొత్త అనుభవం కోసం మార్పులు చేస్తున్నట్లు గవర్నింగ్ బాడీ వెల్లడించింది.

**వన్డే వరల్డ్ కప్ ఇలా..**

వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. మొత్తం 14 జట్లు తలపడనున్నాయి. అయితే, మూడు దశల్లో పోటీపడతాయి.

లోయర్ ర్యాంకుల్లోని మూడు టీమ్‌లు ‘సూపర్ సిరీస్’ అనే తొలి రౌండ్‌లో తలపడుతాయి. ఇందులో టాప్‌లో నిలిచిన జట్టు మాత్రమే ప్రధాన పోటీకి అర్హత సాధిస్తుంది.

రౌండ్ 2లో.. మొత్తం 12 టీమ్‌లు బరిలో ఉంటాయి. ఆరేసి



జట్లుగా విడిపోయి రెండు గ్రూప్‌లు అవుతాయి. మొత్తం 30 మ్యాచులు ఆడతాయి. ప్రతి గ్రూప్ నుంచి టాప్ -3 టీమ్‌లతోపాటు.. రెండు గ్రూపుల్లోని తర్వాత అత్యుత్తమ టీమ్‌తో కలిపి ‘సూపర్ 7’ స్టేజ్‌కు టోర్నీ వెళ్తుంది.

సూపర్ -7లో 21 మ్యాచులు జరుగుతాయి. అందులో నుంచి టాప్ -4 సెమీస్‌కు వెళ్తాయి. ఆ తర్వాత రెండు జట్లు ఫైనల్‌లో కప్పు కోసం తలపడతాయి.

**టీ20 ప్రపంచ కప్ ఇలా..**

టీ20 ప్రపంచ కప్‌లో 20 జట్లు తలపడతాయి. తొలి స్టేజ్‌లో నాలుగేసి టీమ్‌లు ఐదు గ్రూప్‌లుగా విభజించబడతాయి. అంతకుముందు నాలుగు గ్రూప్‌లు ఉండేవి.

ఇక ప్రతి గ్రూప్ నుంచి టాప్ -2 టీమ్‌లు సూపర్ -10లో తలపడతాయి. ఇక్కడా ఐదేసి టీమ్‌లు ఒక్కో గ్రూప్‌గా మారతాయి.

ఈ రెండు గ్రూప్‌ల్లో టాప్‌గా నిలిచిన జట్లుగా సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. ఆయా గ్రూప్‌లో రెండు, మూడో ప్లేసుల్లో ఉన్న టీమ్‌లు మరో గ్రూప్‌లోని ఇదే స్థానంలో ఉండే టీమ్‌లతో ఆపోజిట్ నెంబర్ టీమ్‌లతో ‘ఎలిమినేటర్’లో మళ్లీ తలపడతాయి. అంటే రెండో స్థానంలో ఉన్న జట్టు.. అవతలి గ్రూపులో మూడో స్థానంలో ఉన్న జట్టుతో పోటీపడతాయి. ఇక్కడ నుంచి వచ్చే రెండు జట్లు సెమీస్‌కు వెళ్తాయి.

సెమీస్‌కు చేరే నాలుగు జట్లు పోటీ పడి.. రెండు ఫైనల్‌కు వెళ్తాయి. అక్కడ ఎవరు గెలిస్తే వారిదే కప్పు. టీ20 ప్రపంచ కప్ 2028లో జరగనుంది.

### ఐసీసీ వన్డే ర్యాంకులు..

# అగ్రస్థానంపై శుభ్‌మన్ గిల్ గురి



ఇంగ్లాండ్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ ర్యాంకుల్లోనూ అగ్రస్థానంపై గురి పెట్టాడు. ప్రస్తుతానికి తన ర్యాంకింగ్‌లో మార్పు లేకపోయినా.. రేటింగ్‌లో మాత్రం ముందుకు దూసుకొచ్చాడు. మరోవైపు అతడికి న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. ప్రస్తుతం అతడే 814 పాయింట్లతో టాప్ ర్యాంక్ లో ఉన్నాడు. శుభ్‌మన్ గిల్ 803 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఒక్క మ్యాచ్‌తో గిల్ ఖాతాలోకి 12 పాయింట్లు వచ్చి చేరాయి. మిగిలిన రెండు మ్యాచుల్లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తే గిల్‌కే అగ్రస్థానం దక్కే అవకాశం ఉంది. వీరిద్దరి తర్వాత భారత సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ (757), రోహిత్ శర్మ (744) మూడు, నాలుగు ప్లేసుల్లో కొనసాగుతున్నారు. ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో నిరాశపరిచిన రో–కో.. మిగిలిన మ్యాచుల్లో విఫలమైతే తమ ర్యాంకులకు ప్రమాదం ఎదుర్కోక తప్పదు.

**బౌలర్లలో ఒకే ఒక్కడు..**

బౌలర్ల జాబితాలో టీమ్‌ఇండియా నుంచి టాప్ -10లో ఒక్కరికే అవకాశం దక్కింది. అదీనూ ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో చోటు దక్కించుకోలేకపోయిన కుల్‌దీప్ యాదవ్ కావడం గమనార్హం. కుల్‌దీప్ 608 పాయింట్లతో తొమ్మిది నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. నాలుగు వికెట్లు తీసిన అక్షర్ పటేల్ (503) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని 42వ ర్యాంక్‌లోకి వచ్చాడు. ప్రసిద్ధ్ కృష్ణ (471) ఏకంగా 9 స్థానాలను దాటి 49వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలింగ్ విభాగంలో అగ్రస్థానం రషీద్ ఖాన్ (682)దే.

**ఆల్‌రౌండర్లలో..**

అఫ్గానిస్థాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ (316) టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ, నాలుగు వికెట్ల ప్రదర్శన చేసిన అక్షర్ పటేల్ (ఇూఇఖుతీ గ్రాఫ్‌వశ్రీ)కు టాప్–10లో స్థానం దక్కింది. మూడు స్థానాలు ముందుకొచ్చిన అక్షర్ (213) తొమ్మిదో ర్యాంకులో నిలిచాడు. జట్లపరంగా టీమ్‌ఇండియానే (121) ప్రస్తుతం అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ (110), ఆస్ట్రేలియా (102) తర్వాత స్థానాల్లో నిలిచాయి. భారత్ చేతిలో తొలి వన్డేలో ఓటమిని చవిచూసిన ఇంగ్లాండ్ ఎనిమిదో స్థానానికి పరిమితమైంది.

# ప్రపంచ కప్ నుంచి అర్జెంటీనాను తొలగించండి..

## 75 లక్షల మంది సంతకాలతో పిటిషన్



ఫిఫా ప్రపంచ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను ఢీకొట్టనుంది. అయితే, మ్యాచ్‌కు ముందే అర్జెంటీనాపై ప్రజాగ్రహం వ్యక్తం కావడం గమనార్హం. ఆ జట్టుకు రిఫరీలు అనుకూలంగా మారిపోయారనేది ప్రధాన ఆరోపణ. అర్జెంటీనాను ఫిఫా ప్రపంచ కప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 75 లక్షల మందికిపైగా ఫుట్‌బాల్ అభిమానుల సంతకాలతో ఆన్‌లైన్ పిటిషన్ చక్కర్లు కొడుతున్నట్లు ఓ అంతర్జాతీయ పత్రికా కథనం పేర్కొంది. క్వార్టర్స్‌లో ఈజిప్ట్‌తో మ్యాచ్‌లో అర్జెంటీనా పట్ల పక్షపాతంతో రిఫరీ వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. “లియోనెల్ మెస్సి నాయకత్వంలోని అర్జెంటీనాకు ఫిఫా, రిఫరీలు పూర్తిస్థాయిలో అనుకూలంగా మారిపోయారు. విజేత ఎవరో ముందే నిర్ణయం అయిపోతే మిగతా జట్లు ఎందుకు పోటీ పడాలి? అందుకే, అర్జెంటీనాను వరల్డ్ కప్ నుంచి తప్పించాలి. ప్రతి ఒక్కరికీ సరైన అవకాశం కల్పించాలి” అని నెట్టింట పోస్టు వైరల్‌గా మారింది. ఇవాళ అర్ధరాత్రి ఇంగ్లాండ్ – అర్జెంటీనా జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన టీమ్ ఫైనల్‌లో స్పెయిన్‌ను ఢీకొట్టనుంది.

**“మెస్సిని అడ్డుకొనేందుకు ప్రణాళికలు సిద్ధం”**

టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్ కూడా బలమైన జట్టే. కెప్టెన్ హ్యారీ కేన్, బెల్లింగ్‌హామ్‌తోపాటు ఇతర ప్లేయర్లు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు అర్జెంటీనాపై గెలిచి ఫైనల్‌కు వెళ్లాలనేదే ఇంగ్లాండ్ లక్ష్యం. అలా జరగాలంటే మెస్సిని అడ్డుకోవాల్సిందే. అందు కోసం తమ వద్ద ప్రణాళికలు ఉన్నాయని ఇంగ్లాండ్ మేనేజర్ థామస్ టచెల్ వెల్లడించాడు. “లియోనెల్ మెస్సిని ఎదుర్కోవాలంటే పాత పద్ధతిని అనుసరిస్తే ఎలా ఉంటుందో ఆలోచిస్తున్నాం. మైదానంలో మెస్సి చాలా వేగంగా కదులుతూ ఉంటాడు. ఎక్కడికి బంతి పంపిస్తాడో అంచనా వేయొచ్చు. అయితే, మిగతావారికంటే ముందుగానే పరిస్థితులను త్వరగా అర్థం చేసుకుంటాడు” అని టచెల్ తెలిపాడు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com